క్లుప్తంగా

యల్లనూరు ఏఓగా కిరణ్‌కుమార్‌రెడ్డి



యల్లనూరు: మండల వ్యవసాయాధికారిగా కిరణ్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. సాక్షి దినపత్రికలో 'ఎరువుల డీలర్ల ఇష్టారాజ్యం' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన తాడిపత్రి ఏడీఏ రవి తన కార్యాలయంలో టెక్నికల్ ఏఓగా విధుల్లో ఉన్న కిరణ్‌కుమార్‌రెడ్డిని యల్లనూరు ఏఓగా నియమించారు. దీంతో ఆయన శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సొసైటీ గోదాం వద్ద యూరియా పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఎన్నిబస్తాలు సరఫరా అయ్యాయి, ఎన్ని బస్తాలు పంపిణీ జరిగిందని సొసైటీ సీఈఓ వీరనారప్పను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏఈఓ మధుకుమార్ ఉన్నారు.

సాక్షి ఎఫెక్ట్..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

శింగనమల(నార్పల): నార్పల మండలం నడిమిదొడ్డి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. నడిమిదొడ్డి గ్రామానికి చెందిన రామకృష్ణ నాయనపల్లి క్రాస్ నుంచి గ్రామంలోకి వెళ్తుండగా వెనుక వైపు నుంచి కారు ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈమేరకు నార్పల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా మస్తానయ్య ఉరుసు



పూల చాందినిని ఊరేగిస్తున్న భక్తులు

పెద్దపప్పూరు: మండలంలోని చాగల్లు గ్రామ సమీపంలో కొండపై వెలసిన గుంటికొండ మస్తానయ్య ఉరుసు శుక్రవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజామున గ్రామం నుంచి స్వామి వారి పూల చాందినీని తప్పెట్ల మేళాలతో భక్తులు కొండపై వరకు ఘనంగా ఊరేగించారు. హిందూ ముస్లింలు ఇష్టదైవంగా కొలిచే స్వామివారి ఉరుసు ఏటా భాద్రపదమాసంలో నిర్వహించడం ఆనవాయితీ. వేడుకను తిలకించడానికి పరిసర గ్రామాల నుంచేగాక యాడికి, పెద్దవడుగూరు, తాడిపత్రి, నార్పల, శింగనమల, గుత్తి మండలాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులు మస్తానయ్యకు చెక్కెర, బెల్లం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు.

రసాయనికి ఎరువుల వాడకం తగ్గించండి



వేరుశనగ పంట పరిశీలిస్తున్న అధికారులు

గుత్తి రూరల్: రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని గుత్తి డివిజన్ ఏడీఏ వెంకట్రాముడు, వ్యవసాయాధికారి ముస్తాక్ అహ్మద్ సూచించారు. మండలంలోని కొత్తపేట గ్రామంలో శుక్రవారం ఇంటి గ్యాప్ (గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టిసెస్) ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని వేరుశనగ పొలాలను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు చేశారు. పట్టణానికి చెందిన గౌతమిపురి ఎఫ్‌పీఓ వ్యవసాయ శాఖతో అనుసంధానంగా పని చేస్తుందన్నారు. ఎఫ్‌పీఓ సేంద్రీయ ఎరువుల వినియోగం పెంచి నాణ్యమైన, అధిక దిగుబడులు సాధించడమే సంస్థ లక్ష్యమని తెలియజేశారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఓ అధ్యక్షుడు గోపాల్, సహాయకులు వెంకటేష్, శ్రీనివాస్, ఎంపీఈఓ రాజ్యలక్ష్మి, అరుణ, రైతులు పాల్గొన్నారు.

పాడి రైతుల అభివృద్ధికి చర్యలు



వివరాలు తెలుసుకుంటున్న జేడీ ప్రేమచంద్

బుక్కరాయసముద్రం: జిల్లా వ్యాప్తంగా ఉన్న పాడి రైతుల అభివృద్ధి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ ప్రేమచంద్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాంతీయ పశువైద్యశాలను తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను పరిశీలించారు. మండలంలో పశువులు, పాడి రైతులు, గొర్రెల కాపరుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ రైతులకు పరిశ్రమ ఎంతో లాభదాయకంగా ఉంటుందన్నారు. పశు సంవర్ధక శాఖ ఏడీ రత్నాకర్ పాల్గొన్నారు.



కూలిపోయిన పామిడి ఎంపీడీఓ కార్యాలయ ప్రహరీ



టెక్స్‌టైల్ పార్క్ ప్రహరీ కూలిన దృశ్యం

కూలిన ప్రహరీ.. పట్టించుకునేవారేరీ?

పామిడి: మండల పరిషత్ కార్యాలయం, టెక్స్‌టైల్ పార్క్‌కు సంబంధించి ప్రహరీ కూలినా పట్టించుకునే నాథులే కరువయ్యారు. నెలలు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోవడంలేదు. దీంతో కార్యాలయాలకు భద్రత కరువైంది. భవనాలు పట్టణానికి వెలుపల ఉండడంతో రాత్రి వేళ అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. మరోవైపు మూగజీవాలు ప్రవేశించి కార్యాలయ పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధింత అధికారులు ప్రహరీలను మరమ్మతు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



తాడిపత్రిలో మాట్లాడుతున్న డాక్టర్ సుమన్

తాడిపత్రి రూరల్: మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాని వైద్యులు సుమన్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రామలక్ష్మి, ఉమాదేవి సూచించారు. పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యల్లనూరు: మండలంలోని 85- నిట్టూరు గ్రామంలో శుక్రవారం స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ శివసాయి రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. సీహెచ్‌ఓ మధుకుమార్, సూపర్‌వైజర్లు హాజీవలి, జహీనాబీ, ఎంఎల్‌హెచ్‌పీలు సుప్రియ, లక్ష్మీరాజ్యం, శృతిరెడ్డి, ఏఎస్‌ఎం ఎస్తేర్‌రాణి, హెల్త్ అసిస్టెంట్ నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

గుత్తి రూరల్: ప్రతి మహిళ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని బేతాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు ప్రవీణ్‌కుమార్, దేవేంద్రనాయక్ సూచించారు. మండలంలోని పెద్దొడ్డి గ్రామంలో శుక్రవారం స్వస్థ్‌నారీ-సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సుధారాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పామిడి: ఖాదర్‌పేట గ్రామ ఆరోగ్య ఉపకేంద్రంలో శుక్రవారం వైద్యాధికారి సీ ఉదయార్క్ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఖాదర్‌పేట సర్పంచ్ కే సుశీలమ్మ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 19 నుంచి 49 సంవత్సరాల మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. వ్యక్తిగత పరిశుభ్రతపై డాక్టర్ ఉదయార్క్ వివరించారు. సీహెచ్‌ఓ తులశమ్మ, హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీరామిరెడ్డి, సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీఎస్ నవ్య, శిరీష, రాజేశ్వరి, ప్రేమ, లలిత, ఏఎన్‌ఎంలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు కేతిరెడ్డి పెద్దారెడ్డికి ఆహ్వానం



మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

తాడిపత్రిటౌన్: పట్టణంలోని యల్లనూరు రోడ్డులో ఉన్న విజయచాముండేశ్వరి ఆలయఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 22 నుంచి ఆలయంలో దసరా ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఆలయానికి వచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించాలని మాజీ ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి గౌరవాధ్యక్షులు అనంత శివారెడ్డి, ఉపాధ్యక్షులు నారాయణస్వామి, కోశాధికారి హనుమంత రెడ్డి, కన్వీనర్ పోతుల గంగాధర్‌యాదవ్ పాల్గొన్నారు.

ముగిసిన ఏపీ స్కూల్ గేమ్స్ క్రికెట్ టోర్నీ



స్కూల్ గేమ్స్ క్రికెట్ టోర్నీ విజేతగా నిలిచిన గుత్తి ఆర్‌ఎస్ బాలికల జట్టు

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ క్రీడామైదానంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో గత 20 రోజులుగా జరుగుతున్న ఏపీ స్కూల్ గేమ్స్ క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం ముగిసింది. బాలికల విభాగంలో గుత్తి ఆర్‌ఎస్ జడ్పీ బాలికల జట్టు గుత్తి జడ్పీ బాలికల జట్ల మధ్య ఫైనల్ జరిగింది. గుత్తి ఆర్‌ఎస్ బాలికల జట్టు విజయం సాధించి విజేతగా నిలిచింది. బాలుర విభాగంలో గుత్తి మహర్షి దయానంద గురుకుల పాఠశాల జట్టు గుత్తి ఆర్‌ఎస్ సెయింట్ మేరీస్ జట్ల మధ్య ఫైనల్ పోరు జరిగింది. గుత్తి మహర్షి దయానంద గురుకుల పాఠశాల జట్టు విజేతగా నిలిచింది. టోర్నీలో గుత్తి ఆర్‌ఎస్ బాలికల జట్టు క్రీడాకారిణి సౌమ్య బెస్ట్ బౌలర్, గుత్తి బాలికల జట్టు క్రీడాకారిణి లావణ్య బెస్ట్ బ్యాట్స్ ఉమెన్‌గా ఎంపికైంది. వీరికి ఆర్డీటీ కోచ్ మహేష్, యూత్ లీడర్ సాల్మోన్ రాజు, సీనియర్ న్యాయవాది నవీన్ బహుమతులు ప్రదానం చేశారు.

బస్టాండ్‌ను ప్రైవేట్‌కు అప్పగిస్తే ఊరుకోం



మాట్లాడుతున్న ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి

గుత్తి: గుత్తి ఆర్టీసీ బస్టాండ్‌ను ప్రైవేట్‌కు అప్పగిస్తే ఊరుకోమని వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. గుత్తిలో గురువారం పర్యటించిన ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావు పీపీపీ విధానంలో ఆర్టీసీ బస్టాండ్‌ను నిర్మిస్తామని ప్రకటించడం సిగ్గు చేటన్నారు. ఆర్టీసీ బస్టాండ్‌ను ప్రైవేట్ పరం చేస్తే వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వరదరాజులు, సీనియర్ నాయకులు హరి, చెన్నాజీ, బ్రహ్మకుమార్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ విద్య ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలి



ధర్నా నిర్వహిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

గుంతకల్లు: కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్‌నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక పొట్టి శ్రీరాములు సర్కిల్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన నారా లోకేష్ వాటిని పరిష్కరించకుండా కేవలం రెడ్‌బుక్ రాజ్యాంగం అమల్లోనే ఉండిపోయారని మండిపడ్డారు. గత అసెంబ్లీ సమావేశాల్లో కూటమి నాయకులు పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్ల ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిల్లో రూ.600 కోట్లు మాత్రమే విడుదల చేస్తామని ప్రకటించారని, అది కూడా పత్రికా ప్రకటనలకే పరిమితమైందన్నారు. వైద్య విద్యను పీపీపీ పద్ధతిలో నడిపితే పేద విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మెడికల్ విద్యార్థులకు శాపంగా మారిన జీఓ 107, 108లను రద్దు చేయాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో విద్యారంగ సమస్యలపై చర్చించి పరిష్కారించాలన్నారు. ముఖ్యంగా నారాలోకేష్ యువగళం పాదయాత్రలో విద్యార్థులకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్‌ఎఫ్ నాయకులు ఫర్హన్, శంకరప్పా, ప్రవీణ్ నాయక్, వీరేష్, భాస్కర్, మోహన్, తేజ తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయండి



నెలగొండలో నియామక పత్రాలను అందజేస్తున్న నాయకులు

గుంతకల్లు రూరల్: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పీ.రాము పార్టీ శ్రేణులను కోరారు. గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ఆదేశాల మేరకు అయ్యవారుపల్లి, కదిరిపల్లి, ఇమాంపురం, నాగసముద్రం, వెంకటాంపల్లి, చింతలాంపల్లి, నెలగొండ, పులగుట్టపల్లి, పులగుట్టపల్లి పెద్దతండా, మల్లేనిపల్లి, దోనిముక్కల, జీ.కొట్టాల గ్రామాల్లో శుక్రవారం పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ కమిటీలను నియమించి నియామక పత్రాలను అందజేశారు. గ్రామ కమిటీలు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని సూచించారు. నాయకులు బీసీ సెల్ నియోజకవర్గం అధ్యక్షుడు పెద్దినేని రంగనాయకులు, పంచాయతీరాజ్ విభాగం కమిటీ అధ్యక్షుడు కసాపురం తిక్కస్వామి, రైతు విభాగం నియోజకవర్గం అధ్యక్షుడు బాబూరావు, మాజీ సింగిల్ విండో ఉపాధ్యక్షుడు సోమిరెడ్డి, గుంతకల్లు మండల ఉపాధ్యక్షుడు హనుమంతు, వైటీ చెరువు దశరథ, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు నక్కనదొడ్డి వెంకటేష్, కిసాన్‌సెల్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు జయరామిరెడ్డి, గోవిందు నాయక్, దోసలుడుకి నాగేష్, యేత్ విభాగం అధ్యక్షుడు శాంతు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సెలూన్ షాపులు తొలగించే దాకా పోరాటం



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న క్షౌర వృత్తిదారులు

గుంతకల్లుటౌన్: కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న నాయీబ్రాహ్మణుల కడుపుకొడుతున్న పట్టణంలోని కార్పొరేట్ సెలూన్‌షాపులను తొలగించకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామని క్షౌ రవృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ బి.శ్రీనివాసులు హెచ్చరించారు. పట్టణంలో వివిధ మతాలు, కులాలకు చెందిన వారు ఏర్పాటు చేసిన సెలూన్‌షాపులను తొలగించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారుల వైఖరిని నిరసిస్తూ శుక్రవారం మున్సిపల్ ఆఫీసు ఎదుట ధర్నా నిర్వహించారు. క్షౌ రవృత్తిపై ఆధారపడిన 1,500 కుటుంబాలను రోడ్డున పడేయకుండా స్థానిక ఎమ్మెల్యే, అధికారులు చొరవ చూపాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం కమిషనర్ నయీమ్ అహ్మద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో క్షౌ రవృత్తిదారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మినారాయణ, సూరి, కోశాధికారి బ్రహ్మ, నాయకులు అజయ్, సురేంద్ర, బాల, శివ, ఎర్రిస్వామి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వీఆర్‌ఏల ధర్నా



గుత్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న వీఆర్‌ఏలు

గుంతకల్లు రూరల్: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం వీఆర్‌ఏలు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు .ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఆర్‌ఏలకు పేస్కేలు అమలు చేయాలని, నామినీలను వీఆర్‌ఏలుగా నియమించాలన్నారు. ఈనెల 20,21 తేదీల్లో ఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయాల వద్ద కూడా ధర్నాలు కొనసాగిస్తామని వారు తెలియజేశారు. తహసీల్దార్ రమాదేవి, వీఆర్వోలు తమ సంఘీబావాన్ని తెలియజేశారు.

గుత్తి రూరల్: తమ సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం వీఆర్‌ఏలు మోకాళ్లపై నిల్చొని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏల సంఘం మండలనాయకులు పెద్దన్న, జగదీష్, చిరంజీవి, యుగంధర్ మాట్లాడుతూ వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలు చేసి అర్హులైన వీఆర్‌ఏలకు పదోన్నతులు కల్పించాలన్నారు. నాయకులు ఆది, రామ్‌ప్రసాద్, ధను, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : తమ సమస్యలు పరిష్కరించాలని వీఆర్‌ఏలు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు.

రైతులకు తప్పని యూరియా కష్టాలు



కల్లుమడి రైతు సేవా కేంద్రం వద్ద యూరియా కోసం వచ్చిన రైతులు

శింగనమల: కూటమి ప్రభుత్వంలో రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. యూరియా కొరత లేదని వ్యవసాయాధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. డిమాండ్‌కు తగ్గట్టుగా యూరియా సరఫరా చేయకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. శింగనమల మండలం కల్లుమడి రైతు సేవా కేంద్రానికి శుక్రవారం 20 మెట్రిక్ టన్నులు యూరియా రావడంతో రైతులు యూరియా కోసం పెద్దసంఖ్యలో తరలివచ్చారు. దీంతో పోలీస్ బందోబస్తు నడుమ వ్యవసాయ సిబ్బంది యూరియా పంపిణీ చేశారు. గతంలో రైతు సేవా కేంద్రాలు లేనప్పుడు మండల కేంద్రాల్లో వేరుశనగ విత్తన కాయలు కోసం ఎలా ఇబ్బందులు పడ్డామో, ఆవిధంగానే యూరియాకు ఇక్కట్లు పడుతున్నామని రైతులు చెబుతున్నారు.

సంక్షిప్త సమాచారం

గాలికుంటు వ్యాధి టీకాలను సద్వినియోగం చేసుకోండి.

పెద్దవడుగూరు: పశు పెంపకదారులు గాలికుంటు వ్యాధి టీకాలను సద్వినియోగం చేసుకోవాలని పశు శాఖ ఏడీ డాక్టర్ గుండంపాటి రవిబాబు, పెద్దవడుగూరు పశు వైద్యాధికారి డాక్టర్ రమేష్ కోరారు. మొళకతాళ్ళ గ్రామంలో శుక్రవారం గొర్రెలు పెంపకందారులు, పాడి రైతులకు పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాల్షియం టానిక్కులు, డీ వార్మింగ్, మినరల్ మిక్చర్, నట్టల నివారణ మందును ఉచితంగా పంపిణీ చేశారు. డాక్టర్ పునీత్, నాగరాజు, తిరుపాల్, తిమ్మప్ప, దుర్గా, పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి

గార్లదిన్నె: భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడితే మంచి దిగుబడి సాధించవచ్చునని భూసార పరీక్ష కేంద్రం ఏఓ శ్రీనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రం స్థానిక మోడల్ స్కూల్లో సాయిల్ హెల్త్ ప్రోగ్రామ్ కార్యక్రమం నిర్వహించారు. భూసార పరీక్ష కేంద్రం ఏఓ శేఖర్‌రెడ్డి, ఏఓ సోమశేఖర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సతీష్, ఉపాధ్యాయులు రిజ్వానా, పీఈటీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజు లేఖరుల నిరసన

యాడికి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం దస్తావేజు లేఖరుల సంఘం నాయకులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ జాఫర్ సాధిక్‌కు వినతి పత్రం అందజేశారు. దస్తావేజు లేఖరులు అబ్దుల్ రజాక్, ఈశ్వరప్ప, నరేష్, రామకేశవులు, నవీన్‌కుమార్, దుర్గ, గంగ, ప్రసాద్, రంగా, నాగార్జున పాల్గొన్నారు.

గుత్తి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం దస్తావేజు లేఖరుల సంఘం నాయకులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. దస్తావేజు లేఖరులు బండి సత్య, అనంత, శ్రీకరం నరేష్ రాయల్, రఘు ఆధార్ ఓటీపీ, స్థానిక సంస్థల డేటా బేస్ వంటి లోప భూష్టమైన విధానాలతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ మంజుకు వినతిపత్రం అందజేశారు.

పెనకచెర్ల మారెమ్మ గుడిలో చోరీ

గార్లదిన్నె: పెనకచెర్ల మారెమ్మ ఆలయంలో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఆలయ పూజారి రోజూ మాదిరిగానే రాత్రి ఆలయానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గుడి తలుపులు పగలగొట్టి హుండీలో ఉన్న రూ.2 వేల నగదు, 12 వెండి గొడుగులు, 5 చిన్న బంగారు తాళిబొట్లు, బంగారు గుండ్లు ఎత్తుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

గుత్తి: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా కోరారు. గుత్తి, గుత్తి ఆర్‌ఎస్‌లలో శుక్రవారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ గుత్తి కార్యక్రమాన్ని నిర్వహించారు.

మహిళపై దాడి

గుత్తి రూరల్: బసినేపల్లి తండాలో మహిళపై దాడి జరిగింది. బాధితురాలు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన మాణిక్యమ్మకు ఇంటి పక్కనే ఉన్న గోవిందు నాయక్, పద్మ దంపతులతో గొడవలు ఉండేవి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఇద్దరి మధ్య గొడవ చోటు చేసుకుని మాణిక్యమ్మపై కర్రలు, రాళ్లతో దాడి చేశారు. గాయపడిన మాణిక్యమ్మను భర్త బాబునాయక్ గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

8వ వేతన సంఘాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలి

గుంతకల్లు/గుత్తి: ఎనిమిదవ వేతన సంఘాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. గుంతకల్లుతో పాటు గుత్తిలో మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో రైల్వే కార్మికులు శుక్రవారం ధర్నా చేపట్టారు. గుంతకల్లులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజయ్‌కుమార్, గుత్తిలో యూనియన్ నాయకులు రామాంజుల రెడ్డి, నారాయణ, శేఖర్ బాబు మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని మండిపడ్డారు. 8వ వేతన సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

వైఎస్ జగన్‌ను కలిసిన కొనుదల రమేష్‌రెడ్డి



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో రమేష్‌రెడ్డి

తాడిపత్రి టౌన్: పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహనరెడ్డిని పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొనుదల రమేష్‌రెడ్డి శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా జగన్ తాడిపత్రి రాజకీయ పరిస్థితులపై ఆరా తీసినట్లు రమేష్‌రెడ్డి తెలిపారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉండాలని సూచించినట్లు పేర్కొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన కంచం రామ్మోహన్‌రెడ్డి



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కంచం రామ్మోహన్‌రెడ్డి

తాడిపత్రిటౌన్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత, ఏపీ సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కంచం రామ్మోహన్‌రెడ్డి శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ తాడిపత్రి రాజకీయ పరిస్థితులపై ఆరా తీసినట్లు కంచం తెలిపారు.

రక్తదానంతో ప్రాణదాతలు కండి

గుంతకల్లు: ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతలు కావాలని వక్తలు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలోని విద్యార్థులకు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సిబ్బంది ఆధ్వర్యంలో బ్లడ్ గ్రూపింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గుంతకల్లు మెడికల్ ఆఫీసర్ పవిత్ర ప్రజ్ఞ, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ రక్తదాన ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమణారెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్లు సత్య, ఉమాదేవి, అధ్యాపకులు రాఘవ, ఆనంద్, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కల్పించడమే లక్ష్యం

గుంతకల్లు రూరల్: బాలల హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా ప్రతి పాఠశాలలో యువ, సఖి గ్రూపులను ఏర్పాటు చేస్తున్నామని బాలల పరిరక్షణ సమితి జిల్లా ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకటేశ్వరి సూచించారు. శుక్రవారం పాతకొత్తచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల హక్కులపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అపరిచిత వ్యక్తులతో స్నేహం, తెలియని వ్యక్తులతో ఫోన్లో చాటింగ్, మోసపూరిత ఆన్‌లైన్ చాటింగ్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాల్య వివాహాల వల్ల భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలు, పోక్సోచట్టంలోని అంశాలు తదితర వాటిపై విద్యార్థులకు స్థాయిలో అవగాహన కల్పించారు.

పెనకచెర్ల డ్యామ్ నుంచి నీరు విడుదల

పామిడి: గార్లదిన్నె మండలం పెనకచెర్ల డ్యామ్ నుంచి పామిడి ఉత్తర కాలువకు గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు ఈశ్వర్ శుక్రవారం నీరు విడుదల చేశారు. ఉత్తరకాలువకు 200 క్యూసెక్కుల నీటిని వదిలామని, 30 వేల ఎకరాలకు సాగునీరు అందనుందని హెచ్చెల్సీ అధికారులు తెలిపారు.

ఆలూరు కోన హుండీ ఆదాయం రూ.11.96 లక్షలు

తాడిపత్రిటౌన్: మండలంలోని ఆలూరుకోన రంగనాథస్వామి ఆలయంలో శుక్రవారం శాశ్వత హుండీ కానుకలను లెక్కించారు. హుండీ ద్వారా రూ.11,96,341 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ రామాంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.